రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు సంగారెడ్డి స్విమ్మర్స్

సంగారెడ్డి బ్యూరో నవంబరు 21,ప్రభాతవార్త:
రాష్ట్రస్తాయి స్విమ్మింగ్ పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు సంబందిత అధికారులు తెలిపారు. గురువారం సంగారెడ్డిలో నిర్వహించిన పోటీలలో ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేయడం జరిగిందని చెప్పారు. ఎంపికైనవారు డిసెంబర్ నెలలో భూపాలపల్లిలో జరిగే 9వ తెలంగాణ వింటర్ ఇంటర్ డిస్టిక్ స్విమ్మింగ్ ఛాంపియన్షిప్ 2024 రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని పిడి స్విమ్మింగ్ కోచ్ శేషు కుమార్ తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్ లో బాల బాలికలు రాష్ట్ర స్థాయికి వివిధ విభాగాలలో ఎంపికైన మహమ్మద్ అబ్దుర్ రెహమాన్ సిద్దిఖ్,అలియా ఫాతిమా, నిషిత బాజ్జీ, రితిక,సాహితీ,అబ్దుల్ నజీర్, మహమ్మద్ హుజేర్,వినీత్, విన్సెంట్,మనస్విని రెడ్డి,అనికా సింగ్, రోషిత్ మోక్షా, ఆద్మియా వైష్విక్ అద్విక ఆఫ్రాన్, తక్షిత్, వంశీ ఎంపికయ్యారని తెలిపారు.కార్యక్రమంలో టీఎస్జీఎస్ జిల్లా అధ్యక్షుడు జావిద్ అలీ, డి వై ఎస్ ఓ కాసిం బేగ్, కార్యక్రమంలో స్విమ్మింగ్ పూల్ సిబ్బంది చేవాన్ పవన్ కుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాల సంక్షేమానికి కృషి

సిపి డా॥అనురాధ

సిద్దిపేట అర్బన్, నవంబరు 21, ప్రభాతవార్త : పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ పోలీసుశాఖ కృషి చేస్తుందని సీపీ డాక్టర్ అనురాధ అన్నారు. సిద్దిపేట త్రీ టౌన్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ గత నాలుగు నెలల క్రితం విధి నిర్వహణలో గుండెపోటుతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ యాదగిరి కుటుంబ సభ్యులకు గురువారం సీపీ కార్యాలయంలో పోలీసు శాఖ భద్రత ప్రమాద బీమా రూ. 8 లక్షల చెక్కును సీపీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసు కుటుంబాలకు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి బాసటగా భద్రత స్కీమ్ నిలుస్తుందన్నారు. పోలీసు కుటుంబ సభ్యులకు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా వచ్చి కలవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ యాదమ్మ, సూపరింటెండెంట్ అలీషా, రాష్ట్ర పోలీసు సంఘం ఉపాధ్యక్షులు మన్నె రవీందర్‌రెడ్డి, యాదగిరి కుటంబ సభ్యులు పాల్గొన్నారు.

సర్వేను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

సర్వే వివరాలు తప్పులేకుండా నమోదు చేయాలి

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

పటాన్‌చెరు, నవంబరు 21,ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ, కుటుంబ సర్వే వివరాలలో తప్పులు లేకుండా నమోదు చేయాలని ఎన్యుమరేటర్లకు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు. గురువారం జిన్నారంలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను కలెక్టర్ క్రాంతి వల్లూరు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లతో మాట్లాడి సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వేపై ప్రజలు అపోహలు పెట్టుకోకుండా సిబ్బంది అడిగిన ప్రతి సమాచారాన్ని ఇవ్వాలని సూచించారు. సర్వేలో తీసుకున్న వివరాలు గోప్యంగా ఉంటాయని ప్రతి అంశాన్ని కోడుల రూపంలో రాస్తున్నందున సర్వేకు పూర్తిస్థాయి భద్రత ఉంటుందన్నారు. సర్వే పై ప్రజలు అపోహలు పెట్టుకోవదన్నారు. సర్వే సిబ్బంది కి పూర్తిస్థాయిలో ప్రజలు సహకరించి వారు అడిగిన వివరాలు అందజేయాలని సూచించారు. సూపర్వైజర్లు రూట్ అధికారులు సర్వే పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వే సిబ్బందికి వచ్చే అనుమానాలను వెంటవెంటనే సూపర్ వైజర్లు అధికారులు నివృత్తి చేసి కచ్చితత్వంతో కూడిన సర్వే జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భిక్షపతి,ఏం పి డి ఓ అరుణారెడ్డి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు .

జూనియర్ కళాశాలను డిఐఈవో ఆకస్మిక తనిఖీ

కళాశాలలో రికార్డులు పరిశీలిస్తున్న డిఐఈవో

హుస్నాబాద్ రూరల్, నవంబరు 21, ప్రభాతవార్త : పట్టణంలోని శ్రీఅపోలో ఒకేషనల్ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్ మీడియట్ విద్యాధికారి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని విద్యార్థుల అడ్మిషన్ రికార్డులు, అటెండెన్స్ రికార్డులతోపాటు అధ్యాపకుల అర్హత పత్రాలను పరిశీలించారు. అనంతరం ల్యాబ్‌ల నిర్వహణ, విద్యార్థులను జాబ్ ట్రైనింగ్ గురించి ఎక్కడికి పంపిస్తున్నారని ప్రిన్సిపాల్ వేముల గణేష్, అధ్యాపక బృందాన్ని అడిగి తెలుసుకు న్నారు. తనిఖీలు నిర్వహించినవారిలో సూపరిండెంట్ మూర్తితో పాటు ఉన్నారు.

భూసేకరణకు రైతులు సహకరించాలి : ఆర్డీవో

మాట్లాడుతున్న ఆర్డీవో రాంమూర్తి

ఆక్కన్నపేట, నవంబరు 21, ప్రభాతవార్త : గౌరవెల్లి ప్రాజెక్టు నుండి నీటిని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు నిర్మాణం చేసే కాల్వల నిర్మాణానికి రైతులు సహకరించాలని ఆర్డీవో రాంమూర్తి కోరారు.గురువారం రోజున మండలంలోని అంతకపేట గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వస్తున్న కాల్వల పట్ల రైతులకు ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఎసిపి వాసాల సతీష్, తహసీల్దార్ అనంతరెడ్డి, డీఈ కరుణ, సయబ్ తహసీల్దార్ అరవింద్‌తో పాటు ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ ఎఇకి సన్మానం

ఏఈని సన్మానిస్తున్న దృశ్యం

చిన్నశంకరంపేట, నవంబరు 21, ప్రభాతవార్త: పంచాయతీరాజ్ శాఖ ఏఈగా మమ్మద్ జిషాన్ ఇటీవల బాధ్యతలు చేపట్టి మండల పరిధి సూరం గ్రామానికి రాగా గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

చిన్నశంకరంపేట, నవంబరు 21 ప్రభాతవార్త: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డిఎ పిడి శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని వెంకటరావుపల్లి, సూరారం గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలన్నారు. కోనుగోళ్లను వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఎపిఎం లక్ష్మీనారాయణ, సీసీలు యశోద, నాగరాజు, బుక్ కిపర్ నాగరాజు, వెంకటస్వామి, స్వామి తదితరులు ఉన్నారు.

ధాన్యం కేంద్రాలను పరిశీలిస్తున్న డీఆర్డీఎ పిడి శ్రీనివాసరావు

కంప్యూటర్ ఆపరేటర్లు చిత్తశుద్ధితో పనిచేయాలి

మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

సంగారెడ్డి బ్యూరో, నవంబరు 21 ప్రభాతవార్త:
సమగ్ర కుటుంబ సర్వే క్వాలిటీ డేటా ఎంట్రీ ప్రధాన లక్ష్యంగా 516 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వే డేటా ఎంట్రీపై సంబంధిత మండల అభివృద్ధి అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ శిక్షణా కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వే కంప్యూటర్ ఆపరేటర్లు చిత్తశుద్ధితో పని చేయాలని అన్నారు. చిన్న పొరపాట్లకు కూడా తావివ్వకుండా క్వాలిటీ డేటా ఎంట్రీ ప్రధాన లక్ష్యంగా ప్రణాళిక ప్రకారం డేటా ఎంట్రీ చేయాలని, ఆపరేటర్లు చేసిన డేటా ఎంట్రీని ఎన్యుమరేటర్ తప్పని సరిగా పరిశీలించి ఓకే చేయాలన్నారు. జిల్లాలో సమగ్ర సర్వే నిన్నటి వరకు 86 శాతం పూర్తయిందని తెలిపారు. 516 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను ఇందుకోసం నియమించినట్లు తెలిపారు. 20 మంది ఎంపీడీవోలు, నలుగురు మున్సిపల్ కమిషనర్లు, 19 మంది ఎంపీ ఎస్‌వోలు ఈ డేటా ఎంట్రీలో పాల్గొంటారని తెలిపారు. అంతకు ముందు సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ, కుల సర్వే డేటా ఎంట్రీపై రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన ఈడీఎం సందీప్ ఆపరేటర్లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సుదీర్ఘంగా శిక్షణ ఇచ్చారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ఇవ్వడం జరుగుతుందని, లాగిన్ అయిన తర్వాత పాస్‌వర్డ్ చేంజ్ చేసుకోవాలని, లైవ్‌సర్వర్ ప్రొటెక్షన్ అనే వెబ్‌సైట్‌ను ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, ముఖ్య ప్రణాళికాధికారి బద్రీనాథ్, సంబంధిత ఎంపీడీవోలు, కంప్యూటర్ ఆపరేటర్లు, మండల ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్

మాట్లాడుతున్న ఎసిపి సతీష్

ప్రజల డబ్బు, బంగారం కాపాడాల్సిన బాధ్యత

బ్యాంక్ అధికారులదే : ఎసిపి వాసాల సతీష్

హుస్నాబాద్ రూరల్, నవంబరు 21, ప్రభాతవార్త : ప్రజలు బ్యాంకులలో దాచుకున్న డబ్బు, బంగారం కాపాడవల్సిన బాధ్యత బ్యాంక్ అధికారులదేనని ఎసిపి వాసాల సతీష్ అన్నారు. గురువారం హుస్నాబాద్‌లోని ఎస్‌బిఐ, ఇతర బ్యాంకులను సిఐ కోంద్ర శ్రీనివాస్‌తోకలసి సందర్శించారు. బ్యాంకులలో సెక్యూరిటీ మేజర్స్ గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతీ బ్యాంకులో సీసీ కెమేరాలు పెట్టుకుని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేసుకోవడంతో పాటు బ్యాంకుల్లో ఏ సంఘటన జరిగినా అలార్ మోగేలా సిష్టం ఏర్పాటు చేయాలన్నారు. బ్యాంకులలో ఎలాంటి సంఘటన జరిగినా కేసుల పరిశోదనకు వచ్చే పోలీసులకు అధికారులు సహకరించాలన్నారు. బ్యాంకులో ఉన్న కిటికీలు, డోర్లు, స్ట్రాంగ్‌రూంల పనితీరును ప్రతీ 15 రోజులకు ఒకసారి తనిఖీలు చేసుకోవాలన్నారు. ప్రజలు బ్యాంకులపై నమ్మకంతోనే వారి డబ్బులు దాచుకుంటారని దానిని కాపాడాల్సిన బాధ్యత ప్రతీ బ్యాంక్ అధికారిపై ఉందన్నారు. ఇందుకు పోలీస్ సహకారం ఉంటుందన్నారు. ప్రతీ బ్యాంకులో పాయింట్ బుక్‌లు ఏర్పాటు చేసి రాత్రి సమయంలో సైతం తమ అధికారులు తనిఖీలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బ్యాంకులో, బ్యాంకు ముందు, లోపల, బయటకు వచ్చే దారిలో, మెయిన్‌రోడ్లకు కనిపించేలా సిసి కెమేరాలు ఉండాలన్నారు. ప్రతీ బ్యాంక్ మేనేజరు వద్ద స్థానిక ఎస్‌ఐల నంబర్లు ఉండాలన్నారు. డబ్బును బ్యాంకుల నుండి మెయిన్ బ్రాంచిలకు తరలించే సందర్భంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తోట మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలపై కళా ప్రదర్శన

నర్సాపూర్ రూరల్, నవంబరు 21, ప్రభాతవార్త: ప్రజా పాలన జిల్లా కలెక్టర్, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా గురువారం నర్సాపూర్ మండలం, నర్సాపూర్,జక్కపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాలలో ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమాలు సారధికళాకారులచే పాటలు పాడటం జరిగింది. గ్రామాలలో ప్రజాపాలనపై ప్రజలకు అర్థమయ్యే విధంగా ఆటపాటలతో అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచిన సందర్భంగా ఇప్పటివరకు ప్రజలకు చేరువైన, చేరనున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వాటి ఆవశ్యకతను తెలియజేస్తూ వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాపాలన కళాయాత్రతో పల్లె పల్లె తిరుగుతూ అవగాహన కల్పిస్తున్నారు.


ప్రజా పాలన విజయోత్సవాలపై కళా ప్రదర్శన చేస్తున్న దృశ్యం

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సూరి కృష్ణ

డిసెంబరు 14న లోక్ అదాలత్

సీనియర్ సివిల్ జడ్జి సూరి కృష్ణ

జహీరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలు, జిల్లా సంస్థ సౌజన్యంతో మండల లీగల్ సర్వీసెస్ కమిటి ఆధ్వర్యంలో డిసెంబరు 14వ తారీఖున లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి సూరి కృష్ణ తెలిపారు. గురువారం పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సూరి కృష్ణ మాట్లాడుతూ లోక్ అదాలత్‌తో కక్షిదారులకు, బాధితులకు కలిగే ప్రయోజనలపై వివరించారు. లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కక్షిదారులకు, బాధితులకు సూచించారు. కార్యక్రమంలో లీగల్ సెర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

మత్స్యకారులను బిసి(ఎ)లో చేర్చాలి

ముదిరాజ్ మహాసభ జిల్లా డైరెక్టర్ ఐలయ్య

హుస్నాబాద్ రూరల్, నవంబరు 21, ప్రభాతవార్త : మత్యకారులు (ముదిరాజ్‌లను బిసి(డి) నుండి బిసి (ఎ)లో చేర్చాలని ముదిరాజ్ మహాసభ జిల్లా డైరెక్టర్ పెండ్యల ఐలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం రోజున ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా మండలంలోని పోతారం(ఎస్) గ్రామంలో ముదిరాజ్ మహాసభ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సంఘం జిల్లా డైరెక్టర్ ఐలయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షులు పెన్నబోయిన శ్రీనివాస్‌తో కలసి మాట్లాడుతూ ముదిరాజ్‌లను ప్రభుత్వం వెంటనే బిసి(డి) నుండి బిసి (ఏ)లో చేర్చాలని,ప్రతీ సంఘానికి ప్రభుత్వమే భవనాలు కట్టించాలని, అంతేకాకుండా సబ్సిడీ చేపపిల్లలకు బదులు సంఘాలకు నగదు బదిలీ చేయాలన్నారు. ప్రపంచంలో కల్తీ లేని ఆహారం ఒక్క చాపలు మాత్రమేనని ప్రజలకు కల్తీలేని ఆహారం అందించేందకు మత్స్యకారులు పడుతున్న కష్టాలు ప్రభుత్వం గుర్తించాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతీ మత్స్యకారునికి ఫించన్లు మంజూరు చేయాలని,ముదిరాజ్ కోఆపరేటీవ్ కార్పోరేషన్‌కు రూ 1వేయి కోట్లు కేటాయించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎఫ్‌సిఎస్ చైర్మెన్‌లు రమేష్, మల్లయ్య, బాలయ్య, సంపత్, రాజయ్య, శంకర్, శ్రీనివాస్, రాగుల శ్రీనివాస్ తదితరులు పల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐలయ్య

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి

తూకం వేసిన వెంటనే మిల్లులకు తరలించాలి..48 గంటల్లో రైతులకు డబ్బులు అందేలా చూడాలి...సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

పటాన్‌చెరు(జిన్నారం), నవంబరు 21,ప్రభాతవార్త
తూకం వేసిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించేలా చూడాలని, ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. గురువారం జిన్నారంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంగారెడ్డిజిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి 48 గంటల్లో డబ్బులు రైతుల ఖాతాలో జమ అయ్యేలా వెంటనే ఆన్‌లైన్ టాబ్‌లో వివరాలు ఫీడ్ చేయాలని కలెక్టర్ కొనుగోలు కేంద్ర నిర్వాహకులకు సూచించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన రిజిస్టర్‌లను కలెక్టర్ ఈ సందర్భంగా తనిఖీ చేసి, సంబంధిత సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఇప్పటి వరకు వచ్చిన ధాన్యం వివరాలు, సన్నధాన్య కు సంబందించిన బోనస్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దే అమ్ముకొని, మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. ధాన్యం బస్తాలను తూకం వేసిన వెంటనే ధాన్యం బస్తాల లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, సంబంధిత మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ఓపీఎంఎస్‌లో రైతు పేరు, ఫోన్ నంబర్, ధాన్యం బస్తాలు, తదితర కొనుగోళ్ల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. రైతులు ధాన్యం తీసుకొచ్చిన వెంటనే తూకం జరిపించాలని, రైతులకు ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తెచ్చి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. రైతులు ధాన్యం ఆరబెట్టుకొని నిబంధనల ప్రకారం తేమ శాతం ఉండే విధంగా చూసి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ, జి ఏం కొండల్‌రావు, అదనపు డిఆర్‌డిఓ జంగారెడ్డి, తహసీల్దార్ భిక్షపతి, ఏంపిడిఓ అరుణారెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

బాక్సింగ్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

కొండపాక, నవంబరు 21, ప్రభాతవార్త : బాక్సింగ్ అంత్యంత ఆదరణ పొందిన క్రీడగా పేరు పొందిందాని, ఆ క్రీడలో ఆరు బంగారు పతకాలను కుకునూరుపల్లి పాఠశాల విదార్థులు కైవసం చేసుకొవడం హర్షించదగ్గ విషయమని హెచ్ఎం, ఎంఈఒ బి.సత్తయ్య అన్నారు. కొండపాకలో నిర్వహించిన మెదక్ ఉమ్మడి జిల్లా బాక్సింగ్ పోటీలలో వారు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుకునూరుపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు అండర్ 14, అండర్ 17 విభాగాల్లో అరు పతకాలను సాధించడం గర్వంగా ఉందన్నారు. జూనియర్ బాలుర విభాగంలో నాగులపల్లి భాను, మల్లం సతీష్, సీనియర్ విభాగంలో ఎండి, ఖాళీద్, ఎండి ముస్తకీం,ఎల్లంగారి అనిల్, సీనియర్ బాలికల విభాగంలో నల్ల శివాని పతకాలను సాధించినట్లు ఆయన చెప్పారు. గెలుపొందిన వారు ఈ నెల 22 నుండి 24 వరకు హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా తరపున పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయి లోనూ గెలుపొంది జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆయన విద్యార్థులకు సూచించారు. పతకాలు గెలుపొందిన విద్యార్థులను హెచ్ఎంతోపాటు ఎఎపిసి చైర్మన్ నవనీత, వ్యాయమ ఉపాధ్యాయుడు రాజ్‌కుమార్, అభినందించారు.

ఫ్లోర్ బాల్ జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

చిన్నశంకరంపేట, నవంబరు 21 ప్రభాతవార్త: సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫ్లోర్ బాల్ ఆటలో చిన్నశంకరంపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించారు. పాఠశాలకు చెందిన వర్ణిక,శ్రవంతి, శ్రావణీలు ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లాలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు వాణి కుమారి తెలిపారు. విద్యార్థులను,పీడీ బస్వరాజ్, బాలచందర్‌లను పాఠశాల సిబ్బంది అభినందించారు.

సజావుగా ధాన్యం కొనుగోళ్లు : తహసీల్దార్

నర్సాపూర్ రూరల్, నవంబరు 21, ప్రభాతవార్త:
ధాన్యం కొనుగోలు సజావుగా జరిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల పరిధి చిన్నచింతకుంట గ్రామంలో ఉన్న ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కొనుగోలు ప్రక్రియను, నాణ్యత ప్రమాణాలను, ట్యాబ్ ఎంట్రీ పరిశీలించడం జరిగింది. ఏ రోజు ధాన్యం ఆ రోజే వెంటనే పంపించాలని చెప్పడం జరిగింది. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని వాటిని వెంటనే పరిష్కరించి కొనుగోలు సజావుగా జరిగేందుకు పూర్తి సహకారం ఇస్తామని కొనుగోలు కేంద్ర నిరాఏహకులకు, రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాస్ గారితో పాటు ఏపీఎం గౌరీ శంకర్ ఆర్ ఐ సిద్దిరాంరెడ్డి సిసి ప్రవీణ సిఎ లు లక్ష్మీ, నాగరత్నమ్మ గ్రామ సంఘం లీడర్లు రైతులు పాల్గొన్నారు

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన

నలుగురికి రూ.15 వేల జరిమానా

బెజ్జంకి, నవంబరు 21, ప్రభాతవార్త : 2017వ సంవత్సరంలో మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన కేసును గురువారం హుస్నాబాద్ అడిషనల్ జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కృష్ణాతేజ్ విచారణ జరిపి నేరుస్తులైన కనగండ్ల సురేందర్, మచ్చ కుమార్, శానగొండ శరత్, మ్యాకల శ్రీకాంత్‌లకు రూ.15 వేల జరిమాన విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు. నేస్తులకు శిక్ష పడే విధంగా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగరాజు, కోర్టు కానిస్టేబుల్ సంపత్‌కుమార్‌లు కీలక ప్రాత పోషించారని తెలిపారు.

త్రీఫేస్ స్టార్టర్ చోరీ

చిన్న శంకరంపేట, నవంబరు 21, ప్రభాతవార్త: గుర్తుతెలియని వ్యక్తులు గ్రామపంచాయతీ బోరు మోటర్ స్టార్టర్ ను ఎత్తుకెళ్లిన సంఘటన మండల పరిధి ధర్పల్లి గ్రామంలో గురువారం నాడు చోటుచేసుకుంది. ఈ బోరుమడ నుండి వచ్చే నీటిని గ్రామస్తులకు త్రాగునీటిగా అందిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఉదయం మోటార్ను వేయడానికి వెళ్లిన పంచాయతీ సిబ్బందికి త్రీఫేస్ స్టార్టర్ ను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఏ మేరకు చిన్న శంకరంపేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి నాగరాజు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న

53.50 క్వింటాళ్ల పిడిఎస్ రైస్ స్వాధీనం

సిద్దిపేట రూరల్, నవంబరు 21, ప్రభాతవార్త : సిద్దిపేట అర్బన్ మండల పొన్నాల గ్రామ శివారులో బ్రిడ్జ్ వద్ద సిద్దిపేట త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, పోలీసు సిబ్బందితో వాహనాలు తనిఖీ చేసి 53.50 క్వింటాళ్ల పిడిఎస్ రైస్‌ను గురువారం స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ వైపు నుంచి హైదరాబాద్ వైపుకు వెళ్తున్న టిఎస్36టిఎ536 వాహనాన్ని తనిఖీ చేయగా 85 సంచులలో 53.50 క్వింటాళ్ల పిడిఎస్ రైస్ అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. డ్రైవర్ నూనె శేఖర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదుచేసినట్లు సీఐ విద్యాసాగర్ వివరించారు.

వివరాలను వెల్లడిస్తున్న త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్

Main-II(MDk)-NOV 21:Main-II(MDk)-NOV 21.qxd 11/21/2024 10:21 PM Page 1

చేపపిల్లల పంపిణీని ప్రభుత్వం చేపట్టాలి

గజ్వేల్, నవంబరు 21 (ప్రభాతవార్త): ముదిరాజ్‌ల అభివృద్ధి కోసం గత ప్రభుత్వం చేపట్టిన మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని ముదిరాజ్ సంఘం నాయకులు కోరారు. గురువారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో గల ముదిరాజ్ భవనం వద్ద మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్, ప్రజ్ఞాపూర్ అధ్యక్షుడు ఎల్లా మల్లేశం ఆధ్వర్యంలో ముదిరాజ్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు ముదిరాజ్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి గ్రామానికి చేప పిల్లలను పంపిణీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ప్రజ్ఞాపూర్ అధ్యక్షుడు రొట్టెల శ్రీనివాస్, కోదండరాం పల్లి అధ్యక్షుడు మర్కంటి కనకయ్య, ఉపాధ్యక్షుడు దేవేందర్, శ్రీరాం కృష్ణ, ఎల్లా శ్రీనివాస్, పూదరి కుమార్, కొత్తల సత్తయ్య, బెదరమైన మల్లేశం, బిక్షపతి, కాటు రాజు, శ్రీరాం మల్లేశం, శ్రీరాం యాదగిరి, కొత్తల కుమార్, అనిల్, ఎల్ల హనుమంతు, మర్కంటి కిష్టయ్య, స్వామి, రాజు, మధు, సత్యనారాయణ, కాటు కళ్యాణ్, జంగపల్లి మధు, శ్రీరామ్ శ్రీనివాస్, పుట్ట కనకయ్య, బిక్షపతి, అశోక్, రామస్వామి, శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమ ద్రోహి రేవంత్‌రెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ధరం గురువారెడ్డి

గజ్వేల్, నవంబరు 21 (ప్రభాతవార్త): తెలంగాణ ఉద్యమ ద్రోహి రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై విమర్శలు చేయడం సిగ్గుచేటని బిజెపి రాష్ట్ర నాయకుడు ధరం గురువారెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్‌లో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 8 లక్షల కోట్ల రూపాయలు మహారాష్ట్ర బడ్జెట్‌ను కేటాయించడం జరిగిందని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టిపోతే ఆరు గ్యారంటీల పేరుతో రేవంత్‌రెడ్డి కూడా అదేపని చేస్తున్నాడని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మహారాష్ట్రలో సైతం అవే హామీలు ఇస్తున్నారని, కాంగ్రెస్ అసాధ్యపు హామీలను పసిగట్టిన మహారాష్ట్ర ప్రజలు మళ్ళీ బిజెపికి పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యమ ద్రోహిగా ఉన్న రేవంత్‌రెడ్డి ఉద్యమంలో పోరుయాత్రతో ఉద్యమాన్ని ముందుకు నడిపిన కిషన్‌రెడ్డిపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రజల చేతిలో విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీకి ఇకనుంచి అన్ని ఓటమిలే అని, తెలంగాణ ఏ ఎన్నిక జరిగినా బిజెపి గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు కుడిక్యాల రాములు, గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్, ఉపాధ్యక్షుడు నరసింహ, చెప్యాల వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న సిఎం

-గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

కార్యక్రమంలో మాట్లాడుతున్న తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్, నవంబరు 21 (ప్రభాతవార్త): గత ప్రభుత్వం సృష్టించిన సమస్యలను అధిగమిస్తూ సిఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని సిద్దిపేట జిల్లా డిసిసి అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సింగారంలో తెలంగాణ సాంస్కృతిక సారథి ప్రభుత్వ పథకాల ప్రచార రథంను గజ్వేల్ ఏఎంసి చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే మహిళలకు ఉచిత బస్సు, ఉచిత గృహ విద్యుత్, రూ.500లకే గ్యాస్, రైతు రుణమాఫీ చేశారన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారంలో ఆలస్యం అవుతుందని ప్రజలు భావిస్తున్నారని, కానీ గత ప్రభుత్వం చేసిన అనవసర అప్పులతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధిక మొత్తంలో వడ్డీలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ప్రజలకు దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్యాకేజీలు ఇచ్చామని కెసిఆర్, కెటిఆర్, హరీష్‌రావులు చెప్పుకుంటున్నారని, గత ఏడాదిగా ప్రజలతో మమేకమై ముందుకు సాగుతున్న కాంగ్రెస్ నాయకులకు ముంపు గ్రామాల ప్రజల సమస్యలు అర్థమయ్యాయన్నారు. త్వరలో సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సమస్యలు పరిష్కరిస్తామని నర్సారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్లు నరసింహారెడ్డి, వహీద్, యాదయ్య, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, నాయకులు సమీర్, లక్ష్మారెడ్డి, వెంకటనర్సింహారెడ్డి, జంగం రమేష్‌గౌడ్, గాడిపల్లి శ్రీనివాస్, శివారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, జహీర్, అజ్జర్, గుంటుకు శ్రీను, కొడకండ్ల బాలు, డప్పు గణేష్, రాములు, రమేష్, సత్యనారాయణ, సత్తయ్య, గోపాల్‌రెడ్డి, నర్సింలు, కళాకారులు శ్యామ్, రవి, ప్రకాష్, కనకయ్య, బిక్షపతి, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మత్స్యకార్మిక దినోత్సవం



మత్స్యకార్మిక దినోత్సవ వేడుకల్లో ముదిరాజ్ సంఘం నాయకులు

పుల్‌కల్, నవంబరు 21, ప్రభాతవార్త: ప్రపంచ మత్స్యకార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని మిన్పూర్‌లో ముదిరాజ్‌లు కార్మిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం జండాను సంఘం అధ్యక్షులు కొండగారి నర్సింలు ముదిరాజ్ ఆవిష్కరించి ఉత్సవాలను ప్రారంభించారు. అంతకుముందు ముదిరాజ్ యువకులు గ్రామంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు నర్సింలు మాట్లాడుతూ, మత్స్య సంపదను పెంపొందించాల్సిన బాధ్యత ముదిరాజ్‌లపై ఉందని గుర్తుచేశారు. ముదిరాజ్ కులస్థులను బిసి డి నుంచి బిసి ఎ వర్గీకరణకు ప్రభుత్వం మార్చాలని డిమాండ్ చేశారు. మత్స్యకారులకు చెరువులలో చేపలు పట్టుకునేందుకు వీలుగా రాయితీపై వలలు, ద్విచక్ర వాహనాలు, ఫోర్ వీల్ వాహనాలను సబ్సిడీ కింద అందించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అంతంగారి లక్ష్మయ్య, మాజీ ఎంపిటిసి సభ్యులు దిగోల దుర్గయ్య, మాజీ ఉప సర్పంచ్ మాణెమ్మ, శ్రీశైలం, బోయిని బిక్షపతి ముదిరాజ్, భగవంత్, సాయి కుమార్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ఉపాధి కోసం వలసల బాట

ఖాళీ అవుతున్న తండాలు-దయనీయంగా గిరిజనుల జీవనం

మనూర్ ప్రాంతం నుంచి వలసలు వెళుతున్న గిరిజనులు

మనూర్, నవంబరు 20, ప్రభాతవార్త: స్వాతంత్ర్యం సిద్ధించి 8 దశాబ్దాలు దాటినా నేటికి నారాయణఖేడ్ ప్రాంతం నుంచి గిరిజనుల వలసలు మాత్రం ఆగడం లేదు. పొట్టకూటి కోసం ప్రతి ఏడాది నారాయణఖేడ్ నియోజకవర్గంలోని తండాల నుంచి చెరుకు నరికేందుకు చక్కర కర్మాగారాలకు గిరిజనులు వలసలు వెళుతున్నారు. దీంతో తండాలు ఖాళీ అవుతున్నాయి. ముఖ్యంగా చలికాలంలో వలస వెళ్లిన ప్రాంతాల్లో అవస్థలకు గురికావాల్సి వస్తోంది. పలు తండాలలో చిన్న పిల్లలతో కలిసి కుటుంబ సభ్యులు ఇండ్లకు తాళాలు వేసి సుమారు 5నెలల పాటు వలసల జీవితాన్ని గడుపుతున్నారు. నారాయణఖేడ్ ప్రాంతంలో పరిశ్రమలు లేకపోవడంతోనే వలసలు తప్పడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా 210కి పైబడి గిరిజన తండాలు ఉండగా ఉమ్మడి మనూర్ మండలంలో 48గిరిజన తండాలు ఉన్నాయి. మండలం పక్కనే మంజీరానది ప్రవహిస్తున్నా వ్యవసాయ సాగుకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఈప్రాంతంలో సారవంతమైన భూములేక పంటలు పండటం లేదు. అంతేగాక నీటి వసతి లేక అరకొర పంటలు పండుతుంటాయని రైతులు అంటున్నారు.

బతుకుదెరువు కోసం ఎక్క డో ఒక చోటకెళ్లి జీవనం సాగిస్తున్నామని అంటు న్నారు. ప్రతి సంవత్సరం దీపావళి ముగియగానే కామారెడ్డిలోని మాగీ, జహీరాబాద్ ప్రాంతంలోని గాయత్రి, సంగారెడ్డిలోని గణేష్ చెరుకు కర్మాగారా లతో పాటు పక్కనే ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు నారాయణఖేడ్ ప్రాంతంనుంచి గిరిజనులు, ఇతరులు వేలసంఖ్యలో వెళుతూ ఉంటారు.

-విద్యకు దూరం అవుతున్న చిన్నారులు...

ప్రతి సంవత్సరం నవంబరు మాసంలో నారాయణఖేడ్ ప్రాంతం నుంచి గిరిజనులు, ఇతరులు 5, 6 నెలల కొరకు తమ పిల్లాపాపలతో పనుల కోసం వలసలు వెళుతుండటంతో చిన్నారుల చదువులు కొనసాగడంలేదు. చిన్నారుల భవిష్యత్తు బూడిదలో పోసిన పన్నీరులా మారుతున్నా ఈ ప్రాంతాన్ని పాలిస్తున్న పాలకులు కాని, రాష్ట్ర ప్రభుత్వాలు కాని వలసలు నివారించేందుకు తీసుకుంటున్న జాగ్రత్తలు మాత్రం కానరావడం లేదు. ఎన్నికల సందర్భంగానే వలసల గురించి మాట్లాడి ప్రజలు ఓట్లు దండుకుని గెలిచాక వలసల ప్రస్తావనే ఉండదు. నారాయణఖేడ్ ప్రాంతంలో రెండు మూడు కర్మాగారాలు ప్రారంభం అయితే ఈ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు వలసలు ఆగుతాయని కూలీలు అంటున్నారు.

మండలస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్

తలకొండపల్లి, నవంబరు 21, ప్రభాతవార్త: జనవిజ్ఞాన వేదిక తెలంగాణ ఆధ్వర్యంలో ఈరోజు తలకొండపల్లి మండలంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగింది. కె.చాంప్ల నాయక్, మండల విద్యాధికారి ఝాన్సీలక్ష్మి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థుల శాస్త్రీయ అవగాహన అలవర్చుకోవాలని, మూఢ నమ్మకాలను విడనాడాలని శాస్త్రీయ విజ్ఞానం మానవ జీవితంతో ముడిపడి ఉంటుందని అందుకని ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథంతో మెలగాలని సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు రాములయ్య మాట్లాడుతూ సమాజం అభివృద్ధి చెందాలంటే శాస్త్ర దృక్పథంతో ప్రభుత్వాలు ప్రజలు నడుచుకోవాలని తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆంగ్ల మాధ్యమం విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గట్టు ఇప్పలపల్లి విద్యార్థులు అనూష, అరుణ్ కుమార్, రామ్ చరణ్, తెలుగు మాధ్యమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తలకొండపల్లి విద్యార్థులు ప్రసాద్, వినయ్, నందిని, ఆశ్రమ పాఠశాలల విభాగంలో కేజీబీవీ తలకొండపల్లి విద్యార్థినులు బిందు, షేర్వానీ, అక్షిత జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు ఎంపిక కాబడినారని తెలియజేశారు. విజేతలకు బహుమతులు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో పండుగ అంజయ్య, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అరవింద్, శ్రీనివాసులు, రాధా, వెంకట్ పవర్, విజయ, శ్రీరాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల నిర్మాణం కోసం విరాళం

నందిగామ నవంబరు 21, ప్రభాతవార్త: స్పందించే దానగుణం ఎల్లప్పుడూ పరిమళిస్తుందనడానికి తుమ్మల నరసింహులు యాదవ్ రుజువు చేశారు. షాద్నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి తన వంతు సహాయంగా తన కుమారుడు వినయ్ కుమార్ యాదవ్ చేతుల మీదుగా రూ.51 వేలు విరాళంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అందజేశారు. సేవాదృక్పథాన్ని చాటుకున్న తుమ్మల నరసింహులు యాదవ్‌ను మాజీ ఎమ్మెల్యే ప్రతాపరెడ్డి, మాజీ జెడ్పిటిసి మామిడి శ్యాంసుందర్‌రెడ్డిలు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుల కోసం, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం తనతో చేయి కలుపుతూ ముందుకు వస్తున్న దాతలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెంది తిరుపతిరెడ్డి, కుమార్ గౌడ్, బాబారాలీ ఖాన్ కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

మాలల సింహగర్జన సభకు తరలిరండి

నందిగామ, నవంబరు 21, ప్రభాతవార్త: ఎస్సి వర్గీకరణ విషయంలో మాలలకు అన్యాయం జరగకుండా అందరం సంఘటితం కావలసిన అవసరం వచ్చిందని డిసెంబర్ 1వ తేదీన హైదరాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లో మధ్యాహ్నం జరిగే మాలల సింహగర్జన సభకు భారీ సంఖ్యలో మాలలు తరలిరావాలని నందిగామ మాల మహానాడు నాయకులు ఏకుల వెంకటయ్య, ధారలింగంలు పిలుపునిచ్చారు. గురువారం నందిగామ మండల కేంద్రంలో ఉన్న అంబేద్కర్ కాలనీలో నియోజకవర్గం కన్వీనర్ డాక్టర్ బుచ్చన్న ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో మాలల జనాభా తక్కువగా ఉందని, రాజకీయంగా వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని దుష్ప్రచారం జరుగుతుందన్నారు. దుష్ప్రచారాన్ని అందరం ఖండించాలన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మహేష్, ప్రభయ్య, కోకన్వీనర్లు రామకృష్ణ, జనార్ధన్, అర్జున్ కుమార్, నర్సింలు, రామచంద్రయ్య, మహేష్, యాదయ్య, జంగయ్య, సాయి ప్రేమ్, ప్రభయ్య, ఏకుల జంగయ్య, అంజయ్య, శ్రీకాంత్, రమేష్ తదితరులు ఉన్నారు.

స్థానిక స్థంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

జిల్లెడు చౌదరిగూడ, నవంబరు 21,ప్రభాతవార్త: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో తమ పార్టీ సత్తా చాటాలని బీజేపి జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలచారి అన్నారు. గురువారం జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలోని ఆర్యసమాజ్ భవనంలో నిర్వహించిన క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బిజెపి సభ్యత్య నమోదు అధికంగా ఉండాలన్నారు. వచ్చే ఎన్నికలలో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సభ్యత్వ నమోదు మండల ఇంచార్జీ కక్కునూరి వెంకటేష్‌గుప్త, మండల అధ్యక్షుడు బోయ కుర్మయ్య, రాజు, శ్రీశైలం, విఠల్, భీమయ్య, హారీష్, నవీన్, సాయిరామ్, రవీందర్‌రెడ్డి, మల్లేష్, సంజయ్ పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను విడనాడాలి

కేశంపేట నవంబరు 21, ప్రభాతవార్త: కేశంపేట మండల కేంద్రంలోని జన విజ్ఞాన వేదికలో గురువారం కేశంపేట్ మండల విద్యా కమిటీ ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సంబరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చంద్రశేఖర్ హాజరయ్యారు. విద్యార్థినీ విద్యార్థులు శాస్త్రీయ అవగాహన అలవర్చుకోవాలని మూఢనమ్మకాలను విడనాడాలని శాస్త్రీయ విజ్ఞానం మానవ జీవితంతో ఎంతో ముడిపడి ఉంటుందని అందుకని ప్రతి ఒక్కరు శాస్త్రీయ దృక్పథంతో మెలగాలని ఆయన విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. జనవిజ్ఞాన వేదిక డివిజన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ పాషా మాట్లాడుతూ సమాజం అభివృద్ధి చెందాలంటే శాస్త్ర దృక్పథంతో ప్రభుత్వాలు ప్రజలు నడుచుకోవాలని యువత శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పరీక్షలలో ప్రభుత్వ ఆంగ్ల మాధ్యమం విభాగాలలో జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల కొత్తపేట విద్యార్థులు జేరవన్ కే శివశంకర్, తెలుగు మాధ్యమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొత్తపేట విద్యార్థులు ఎస్ భవ్య శ్రీ, ప్రైవేట్ స్కూల్ తొమ్మిది రేకులలోని రామకృష్ణ హై స్కూల్ విద్యార్థులు కె.శ్రీహరి, ఎల్.ఆదిత్య, కృష్ణ జిల్లాస్థాయి సైన్స్ సంబరాలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్.పి.హెచ్.ఎస్. కేశంపేట ప్రధాన ఉపాధ్యాయురాలు విద్యావతి, మరియు జెవివి కార్యకర్తలు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

బదిలీలు పొందిన వారిపై క్రమశిక్షణ చర్యలు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబరు 21, ప్రభాతవార్త: మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలో ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీలలో నిబంధనలకు విరుద్ధంగా 11మంది ఉపాధ్యాయులు స్పౌజ్ బదిలీలు పొందినట్లు, వీరిలో ఇద్దరు హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారని, ఆ స్టే వెకెట్ కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు, మిగతా 9మంది ఉపాధ్యాయులపై క్రమశిక్షణ కింద చార్జస్ చర్యలు తీసుకోవటం జరుగుతుందని మేడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి పేర్కొన్నారు. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో డిఇఓ కార్యాలయం నుంచి ప్రకటనను విడుదల చేశారు. పలు ఉపాధ్యాయ జెఎసి సంఘాలు స్పౌజ్ ఉపాధ్యాయుల బదిలీల అవతవకలపై విచారణ చేపట్టాలని లేకుంటే ధర్నాకు దిగుతామని డిఇఓకు ఇటీవల ధర్నా నోటీసు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై డిఇఓ ఉపాధ్యాయ సంఘాల జెఎసి ప్రతినిధులతో సమావేశం కూడ కావటం జరిగింది. దీనికి డిఇఓ విజయకుమారి స్పందించారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నుంచి అధికారికంగ ఉపాధ్యాయ బదిలీలు స్పౌజ్ ద్వారా పొందిన వారిపై క్రమశిక్షణ కింద చార్జెస్ ఫ్రేమ్ చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించారు. అయితే దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలో ఇటీవల జరిగిన ఉపాధ్యాయల బదిలీల కౌన్సిలింగ్‌లో స్పౌజ్ కేటగిరిలో 11మంది ఉపాధ్యాయులు వారి స్పౌజ్‌కు సమీపంలో గల ఖాళీ పోస్టులను ఎంపిక చేసుకొనకుండ వారికి అనుకూలంగ వెబ్ కౌన్సిలింగ్ నందు స్పౌజ్ కేటగిరిలో ఇతర ఖాళీ పోస్టులలో నిబంధనలకు విరుద్దంగ ఎంచుకోవటం జరిగిందన్నారు. వారిపై క్రమ శిక్షణ చర్యలలో భాగంగ చార్జెస్ ఫ్రేమ్ చేయటం జరుగుతుందన్నారు. ఇట్టి చార్జెస్‌పై ఇద్దరు ఉపాధ్యాయులు హైకోర్టును ఆశ్రయించి స్టే ఉత్తర్వులు పొందటం జరిగిందని, స్టే పొందిన వారిలో వై.రామేశ్వర్ కాప్రా స్కూల్, అనిల్‌కుమార్ బోడుప్పల్ స్కూల్స్ వారు ఉన్నట్లు వివరించారు. హైకోర్టు నందు స్టే ఎత్తివేతకు జిల్లా నుంచి వెకెట్ పిటిషన్‌ను సమర్పించటం జరిగిందన్నారు. స్పౌజ్ కేటగిరికి విరుద్దంగ బదిలీకాబడిన ఇతర ఉపాధ్యాయుల వివరాలు ఇలా ఉన్నాయి. ఉపాధ్యాయులు వై.స్మితారాణి సూరారం స్కూల్, డి.అంజని ఆర్‌పి స్కూల్, సిహెచ్ సునిత నెరడ్‌మెట్ స్కూల్, వై.శ్రీలత మేడ్చల్ జి.స్కూల్, జి.శైలజ హబ్సిగూడ స్కూల్, జి.సృజన వివేక్‌నగర్ స్కూల్, జి.అరుణాదేవి సాయినగర్ స్కూల్, కీర్తి ఫీర్జాదిగూడ స్కూల్, జి.స్వర్ణలత అంబేద్కర్‌నగర్ స్కూల్స్ వారు ఉన్నట్లు తదుపరి ఉత్తర్వులను అనుసరించి స్పౌజ్ మిస్ యూజ్‌చేసిన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు.

జిల్లాస్థాయికి విద్యార్థుల ఎంపిక

జిల్లెడు చౌదరిగూడ, నవంబరు 21 ప్రభాతవార్త: చెకుమకి పరీక్షలలో ముగ్గురు విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపిక అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత గురువారం తెలిపారు. జిల్లెడు చౌదరిగూడ మండలంలోని చౌదరిగూడ జిల్లా పరిషత్ ఉనత్న పాఠశాలకు చెందిన పూజిత, కీర్తన, సింధులు జిల్లా స్థాయికి ఎంపిక కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను అభినందించారు.

ఇల్లు కాలిపోయే....సర్వం కోల్పోయే

దగ్ధమైన యాదమ్మ ఇంటిని పరిశీలిస్తున్న తహీసల్దార్ మన్నన్

చిన్నశంకరంపేట, నవంబరు 21, ప్రభాతవార్త: చిన్న శంకరంపేట మండలం ఖాజాపూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమై సర్వం కాలి బూడిదైపోయింది. సాయిని యాదమ్మ స్థానికంగా ఉన్న ప్రైవేటు పరిశ్రమలో కూలిపని చేసుకుంటూ జీవిస్తుంది. కాగా యాదమ్మకు 30 సంవత్సరాల క్రితం ఏసయ్యతో వివాహము జరిగింది. వారికి కూతురు అనూష, కొడుకు నవీన్‌లు ఉన్నారు. యాదమ్మ భర్త ఏసయ్య పిల్లలు చిన్నగా ఉన్నప్పుడే కుటుంబాన్ని వదిలేసి వెళ్లాడు. కూతురి పెళ్లికి చేసిన అప్పులకు తోడు తనకు వచ్చిన హృదయ సంబంధ వ్యాధి చికిత్స కోసం చేసిన అప్పులు కూడా పెరిగిపోయాయి. యాదమ్మ ఎప్పటి లాగానే గురువారం ఉదయం పరిశ్రమలో కూలిపనికి వెళ్ళింది. ఇంతలో ఇంటినుండి పొగ రావడంతో పక్కింటి వారు ఆమెకు సమాచారం అందించారు. ఆమె వచ్చి చూడగా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు మొత్తం కాలిపోయింది. ఇంట్లోని దుస్తులు నిత్యావసర వస్తువులు రెండు క్వింటాళ్ల బియ్యం, కొడుకు, కూతుళ్ళ సర్టిఫికెట్లు మొత్తం కాలిపోయాయి. ఒంటిమీద దుస్తులు తప్ప ఆమెకు ఏమి మిగిలి లేదని రోదించిన తీరు అక్కడున్నవారి మనసును కలిచివేసింది. సోమవారం ఆమె ఆసుపత్రికెళ్లి వైద్యం చేయించుకోవలసి ఉంది. వైద్యచికిత్స నిమిత్తం 45000 వేల నగదును అప్పుచేసి ఇంట్లో పెట్టుకుంది. ఇప్పుడు ఆ డబ్బులు కూడా మొత్తం కాలిపోయాయి. సర్వం కోల్పోయి రోడ్డున పడ్డ యాదమ్మను ఆదుకోవాలని నాయకులు కుంట నరేష్, తీగుళ్ల స్వామి, భిక్షపతిలు (గుడ్డు) కోరారు. కాగా తహసీల్దార్ మన్నన్, ఆర్ఐ రాజు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

మల్లేష్ కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా

కేశంపేట, నవంబరు 21, ప్రభాతవార్త: కేశంపేట మండల పరిధిలోని పోమాల్ పల్లి గ్రామానికి చెందిన కేశంపేట మల్లేష్ గత వారం రోజుల క్రితం లేమామిడి గ్రామ శివారులో రోడ్డు ప్రమాదానికి గురై ఉస్మాని యా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ ప్రమాదానికి కారకుడైన లేమామిడి గ్రామానికి చెందిన నందాచారి అని మృతుడి కుటుంబ సభ్యులు బంధువులు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు నందాచారి పై చట్టరీత్య చర్యలు తీసుకొని బాధిత కుటుంబానికి సరైన న్యాయం చేయాలంటూ మల్లేష్ కుటుంబ సభ్యులు బంధుమిత్రులు పోమల్ పల్లి గ్రామస్తులు గురువారం లేమామిడి గ్రామంలో రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. ఆమనగల్ నుండి షాద్ నగర్ వైపు వెళ్లే బస్సులకు, కార్లు, బైకులకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో అటువైపుగా ప్రయాణించే ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురైనందువల్ల కేశంపేట సిఐ నరహరి, ఎస్సై రాజ్ కుమార్ తమ సిబ్బందితో అక్కడికి చేరుకొని మల్లేష్ కుటుంబ సభ్యులకు తగు న్యాయం చూస్తామని లేనిపక్షంలో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బాధిత కుటుంబ సభ్యులను ఒప్పించి ధర్నా విరమింప చేశారు.

సొంత ఖర్చులతో గుంతల మరమ్మతు

కేశంపేట నవంబరు 21 ప్రభాతవార్త: కేశంపేట మండల పరిధిలోని వేముల నర్వ గ్రామం చింతకుంటపల్లి గ్రామం మీదుగా కొండారెడ్డిపల్లికి వెళ్లే బీటీ రోడ్డు గుంతల మయంగా మారింది. వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి కంకర తెలింది. ఈ రహదారిపై ప్రయాణించాలంటే వాహనదారులు నరకయాతనను అనుభవిస్తున్నారు. గుంతలతో రోడ్డు ప్రమాదాలు కూడా జరిగాయి ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూసిన చింతకుంటపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లు శ్రీధర్ రెడ్డి, అనేమోని మల్లేష్ యాదవ్ బిటి రోడ్డు కు తమ సొంత ఖర్చులతో తాత్కాలిక మరమ్మత్తు పనులను చేపట్టారు. రోడ్డుపై గుంతలు ఏర్పడ్డచోట మట్టిని పోయించారు. దీంతో వాహనదారులకు ప్రయాణం కొంత సుగమం అ

మాట్లాడుతున్న కాంగ్రెస్ ఓబిసిసెలన నాయకులు

రైతులను మోసం చేసిన ఘనత హరీష్‌రావుదే

డిసిసి ఒబిసిసెల్ మండల అధ్యక్షుడు చిరంజీవి

చిన్నకొడూరు, నవంబరు 21 ప్రభాతవార్త : జిల్లా రైతులను మోసం చేసిన ఘనత మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావుకే దక్కుతుందని డిసిసి ఒబిసిసెల్ మండల అధ్యక్షుడు బంక చిరంజీవియాదవ్ అన్నారు. చిన్నకోడూరులో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటలలో రైతుల ఖాతాలలో డబ్బులు జమచేస్తున్న ఘనత సిఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు. రైతుల ఖాతాలలో డబ్బులు జమకావడం లేదని బిఆర్ఎస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. బిఆర్ఎస్ నాయకులు ఇంకా అధికారంలో ఉన్నట్లే ఫీలవుతున్నారన్నారు. రంగనాయక సాగర్ ప్రాజెక్టులో భూమిలో కోల్పోయిన బాధితులకు సహాయం చేయకుండా ప్రశ్నిస్తే అనాడు హరీష్‌రావు అక్రమ కేసులు పెట్టించారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ చేసిందని ఇంకా ఎక్కడైనా చిన్న చిన్న పొరపాట్లతో మిగిలిపోయిన రైతులకు సైతం ప్రభుత్వం రుణామాఫీ చేసితీరుతుందన్నారు. రుణామాఫీ కానీ రైతులు తప్పులు ఉంటే సరిచేసుకోవాలని రుణమాఫీ అవుతుందన్నారు. కార్యక్రమంలో జంగిటి బాలరాజు, కూన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్యా

మాట్లాడుతున్న జయదేవ్ ఆర్యా

నంగునూర్, నవంబరు 21, ప్రభాతవార్త: మహిళలు గొప్ప వ్యాపారవేత్తలుగా తయారుచేయడమే ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ సంస్థల క్రమబద్ధీకరణ పథకం ముఖ్య ఉద్దేశమని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్యా అన్నారు. గురువారం నంగునూర్‌లోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో యూనియన్ బ్యాంకు ఏర్పాటు చేసిన మహిళ సంఘాలకు రూ.6 కోట్ల చెక్స్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పిఎంఎఫ్ఎఈ పథకం ద్వారా అనేక రకాల యూనిట్స్ ఏర్పాటు చేసుకోవచ్చునని తెలిపారు. వ్యక్తిగత రుణాలతో పాటు గ్రూప్ రుణాలను పొందిపుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చునని తెలిపారు. ఈ పథకం ద్వారా గరిష్టంగా రూ.50 లక్షల వరకు వ్యక్తిగల రుణం పొందచచ్చునని తెలిపారు. ఇద్దరు లేదా అంతకన్నా ఎక్కువ సభ్యులతో ఏర్పడిన గ్రూప్‌కు-10 కోట్ల వరకు రుణాలు పొందవచ్చునని తెలిపారు. 35 శాతం సబ్సిడీతో వ్యక్తిగతంగా పొందిన రుణానికి గరిష్టంగా 10 లక్షల వరకు గ్రూప్ వారిగా పొందిన రుణానికి గరిష్టంగా 3 కోట్ల వరకు సబ్సిడీ వర్తించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో యూబిఐ రిజనల్ మేనేజర్ వికాస్, ఎడిఎం హరిబాబు, బ్యాంకు మేనేజర్ అనిల్, నాయకులు దేవులపల్లి యాదగిరి, చక్రపాణి, ఐకెపి ఏపీఎం మహిపాల్, సీసీలు పంగ లింగం, సాయిలు, మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, బాలకిషన్, ఆయా గ్రామాల వివోఎలు పాల్గొన్నారు.

ఉచిత విద్య, వైద్యం ప్రతి ఒక్కరి హక్కు : ఎమ్మెల్యే

భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే డా॥సత్యనారాయణ

బెజ్జంకి, నవంబరు 21, ప్రభాతవార్త : ఉచిత విద్య, వైద్యం ప్రతి ఒక్కరి హక్కు అని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. గురువారం మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలో నూతనంగా ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం దాచారం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు షూలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. ఆరోగ్య ఉప కేంద్రం పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ ప్రవీణ్, ఆరోగ్య ఉప కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కృష్ణతేజ, ఎంఈవో మహతిలక్ష్మి, హెచ్ఎం మల్లారెడ్డి, ఎఎంసి చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఒగ్గు దామోదర్, ముక్కిస రత్నాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్నివర్గాలకు న్యాయం

సిఎం రేవంత్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎన్ఎస్‌యుఐ నాయకులు అనిల్‌కుమార్

సిద్దిపేట రూరల్, నవంబరు 21, ప్రభాతవార్త : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడకు విచ్చేసిన సిఎం రేవంత్‌రెడ్డిని శాలువాతో ఘనంగా స్వాగతంపలికి సత్కరించినట్లు ఎన్ఎస్‌యుఐ సిద్దిపేట నియోజకవర్గ నాయకులు జి.అనిల్‌కుమార్ తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని పట్టించుకున్న పాపానపోలేదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంతో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం ఎంతో అభివృద్ధి జరుగుతుందన్నారు.

కాంగ్రెస్‌పై దుష్ప్రచారం చేస్తున్న ప్రతిపక్షాలు

జంగం రమేష్‌గౌడ్

గజ్వేల్ టౌన్, నవంబరు 21 (ప్రభాతవార్త): కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేయడం సరికాదని ఆ పార్టీ గజ్వేల్ నేత జంగం రమేష్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రజలలో విశ్వాసం కోల్పోయి అధికారం కోల్పోయిన బిఆర్ఎస్ నేతలు అధికారంలో ఉన్నప్పుడు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందించామని గ్లోబల్ ప్రచారం చేస్తున్నారని, ప్రజలకుసంక్షేమ పథకాలు అందించినట్లయితే ఎందుకు అధికారం ఇవ్వలేదని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ ఆదేశాలతో ఎన్నికల్లో ఇచ్చినమాట ప్రకారం ఆరుగ్యారంటీ పథకాలను ఏడాది కాలంలో అమలు అవుతున్నాయని, రాష్ట్రంలో ప్రజా సంక్షేమం కోసం ప్రజాపాలన కొనసాగిస్తుంటే ప్రతిపక్ష బిఆర్ఎస్, బిజెపి నాయకులు సిఎం రేవంత్‌రెడ్డి పాలనపై దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. బిఆర్ఎస్ పార్టీ పదేండ్లు అధికారంలో ఉండి ఏ ఒక్కరికైనా రేషన్‌కార్డు ఇచ్చారా అని అన్నారు. దళితున్ని సిఎంను చేస్తామని చెప్పి దళితులను మోసం చేశారని, ఎంత మంది బిసిలకు, మహిళలకు, మైనార్టీలకు మంత్రి పదవులు ఇచ్చారో ప్రజలకు తెలుసన్నారు. వచ్చే ఏడాది రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం కాబోతుందని, దీనిపై ఎలాంటి అపోహలు లేవని ఆయన అన్నారు.

ఫీజు రీయంబర్స్‌మెంటు నిధులు వెంటనే విడుదల చేయాలి

ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్

నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్ మెంటును తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్ డిమాండ్ చేశారు. గురువారం పెండింగ్ ఉపకార వేతనాల విడుదలలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ డా.బి.ఆర్.అంబేద్కర్ సర్కిల్ ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులకు ఉపకార వేతనాలు విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం రెండు నెలలో బకాయిలు విడుదల చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోవడం సరికాదన్నారు. బకాయిలు విడుదల చేయకపోవడంతో డిగ్రీ విద్యార్థుల చదువులు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులనే రేవంత్‌రెడ్డి సర్కారు చేస్తుందన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపిలకు, ఎమ్మెల్సీ లకు, పరిపాలన అధికారులకు ఏ విధంగా అయితే వేతనాలు చెల్లిస్తున్నారో అలాగే విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్ మెంటు చెల్లించాలన్నారు. విద్యార్థులకు బకాయిలు చెల్లించకుంటే రాబోయే రోజుల్లో ఆందోళనలు చేస్తామన్నార. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు రామగళ్ల నరేష్, వేల్పుల ప్రసన్నకుమార్, జక్కుల అనిరుద్, కార్తీక్, యాట ఉమేష్, జస్వంత్, సందీప్, వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లాంగ్‌జంప్ పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్

ఆదర్శ పాఠశాలలో లాంగ్‌జంప్ పోటీలు

జగదేవ్‌పూర్, నవంబరు 21 (ప్రభాతవార్త): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను గురువారం పాఠశాలల డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు రకాల రికార్డులను పరిశీలించి విద్యార్థులతో సమావేశమై ఉపాధ్యాయుల బోధన గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో సౌకర్యాలు సక్రమంగా ఉన్నాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా విద్యార్థులు రానున్న పరీక్షలలో మంచి ప్రతిభ కనబర్చాలని, 10వ తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులు పరీక్షలకు ఏవిధంగా సన్నద్ధం కావాలో పలు సూచనలు, సలహాలు చేశారు. తదనంతరం పాఠశాలలో ఏర్పాటుచేసిన లాంగ్‌జంప్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఏవో మంజరి రవికుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ కాట స్లీవరాజు, రాము, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ములుగు, నవంబరు 21 (ప్రభాతవార్త): ములుగు మండలం కొక్కొండ సబ్‌స్టేషన్ పరిధిలో 33కెవిలైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ తెలిపారు. కొక్కొండ సబ్‌స్టేషన్ పరిధిలోఉన్న కొత్తూరు, కొక్కొండ, సింగన్నగూడ, శ్రీరాంపూర్ గ్రామాలకు శుక్ర వారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహక రించాలని కోరారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

జగదేవ్‌పూర్, నవంబరు 21 (ప్రభాతవార్త): మండల పరిధిలోని మునిగడప గ్రామానికి చెందిన దూల్‌మిట్ట రామవ్వ గురువారం అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న గజ్వేల్ నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షుడు రాచమల్ల ఎల్లేశ్ మృతురాలి కుటుంబసభ్యులను రజక సంఘం నాయకులతో కలిసి పరామర్శించారు. బాధిత కుటుంబానికి రజక సంఘం తరపున రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రజక కుటుంబాలలో ఎవరు మృతిచెందినా వారి కుటుంబాలకు అండగా రజక సంఘం తరపున ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు రాచకొండ యాదగిరి, రాచమల్ల శ్రీనివాస్, వడ్లకొండ శ్రీనివాస్, రాచకొండ బాల్‌నర్సయ్య, అక్కరాజు కనకయ్య, రాజయ్య, దశరథ, ఆంజనేయులు, ఉప్పలయ్య, దూలిమిట్ట కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మత్స్యకారుల దినోత్సవం

కొండపాక, నవంబరు 21, ప్రభాతవార్త : అత్యధిక జనాబా కలిగిన ముదిరాజ్‌లకు ప్రభుత్వం అండగా ఉండాలని ముదిరాజ్ సంఘం నాయకుడు మిద్దె శివకుమార్ అన్నారు. గురువారం దుద్దెడలో మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా అయన జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా నవంబర్ 21న మత్స్యకారుల దినోత్సవం జరుపుకుంటున్నమన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు నరహరి, కాట యాదగిరి, నాగరాజు, శ్రీనివాస్, కనకయ్య, భూమయ్య, యాదగిరి, కొండల్, ఎల్లం పాల్గొన్నారు.

దుద్దెడలో మత్స్యకారుల జెండాను ఎగురవేస్తున్న దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నేత బాల్‌నర్సయ్య

వికలాంగులకు విద్య ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు అమ్ముల బాల్‌నర్సయ్య

కొండపాక, నవంబరు 21, ప్రభాతవార్త : విద్య ఉద్యోగాల్లో వికలాంగులకు 5 శాతం సీట్లు కేటాయించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు అమ్ముల బాల్‌నర్సయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కుకునూరుపల్లిలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మండల కమిటీ సమావేవం నిర్వహించారు. వికలాంగులకు ప్రబుత్వం ఇస్తున్న పెంచన్‌ను రూ॥ 6 వేలకు పెంచాలని, ప్రభుత్వ పథకాల్లో అవకాశం కల్పించాలని, వికలాంగులకు ఉపయోగపడే పరికరాలను అందివ్వాలని కోరారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడుగా బాల్‌నర్సయ్య, అధ్యక్షులుగా తన్నీరు సాయిలు, ఉపాధ్యక్షులుగా మేకల కనకయ్య, గణేష్, ఎండి బిబి పాషా, కార్యదర్శిగా కోరే శ్రీనివాస్, సహక కార్యదర్శిలుగా కానుగంటి రాజు, బాల్‌లక్ష్మి, రాములు, కోశాధికారిగా ఎడ్ల వెంకటేశ్, సభ్యులుగా నవీన్, దిలీఫ్, సత్తయ్య, సాయవ్వ, క్రిష్ణవేణి, సత్యనారాయణ, నరేష్ పాల్గొన్నారు.

పేదలకు వరం సిఎం సహాయ నిధి

చిన్నశంకరంపేట, నవంబరు 21 ప్రభాతవార్త: సిఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదని కాంగ్రెస్‌పార్టీ యూత్ నాయకుడు రాజ్‌కుమార్‌గౌడ్ అన్నారు. మండల పరిధి సూరారం గ్రామానికి చెందిన దుబ్బయ్య అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. రూ.21,500/ చెక్కు మంజూరు కాగా ఆ చెక్కును కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాజు అందించారు. అలాగే టీ మాంధాపూర్ తండాకు చెందిన రుక్మిణి సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసు కోగా రూ 30,000 వేల రూపాయల చెక్కు మంజూరు కాగా, ఆ చెక్కును కాంగ్రెస్ పార్టీ నాయకులు పెంటయ్య నాయక్ రవి నాయకులు అందించారు.

విష్ణు ఫార్మసీ కళాశాలలో జాతీయ వారోత్సవాలు

నర్సాపూర్, నవంబరు 21, ప్రభాతవార్త : నర్సాపూర్ సమీపంలోని విష్ణు ఫార్మసి కళాశాలలో గురువారం జాతీయ ఫార్మసి వారోత్సవాలు నిర్వహించారు. విద్యార్థుల ఎక్సేంజ్‌లో భాగంగా అమెరికాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ ఫిన్ట్ లే విద్యార్థులు బేలి మికర్, సారా అండ్రస్‌లు ఫార్మసి కళాశాలలోని అనిమల్ హౌస్ ల్యాబ్‌లో ఎక్స్పెరిమెంటల్ అనిమల్ హైడ్లింగ్ టెక్నిక్స్, ఎవ్యూలేషన్ ఆఫ్ అంటిడిప్రెసెంట్ ఆక్టివిటీలో ప్రావీణ్యం సాధించారు. వచ్చే విద్య సంవత్సరం విష్ణు ఫార్మసి కళాశాల విద్యార్థులు ఎక్సేంజ్ కార్యక్రమంలో భాగంగా అమెరికాలోని యూనివర్సిటీకి వెళ్ళనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్ విద్యార్థుల ఎక్సేంజ్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, హెచ్‌ఓడి రాజ శేఖర్, అధ్యాపకులు ఫహీం మోద్దీన్, గాయత్రి, నవీన్ పాల్గొన్నారు.

గ్రామపంచాయతీకి కంప్యూటర్ బహూకరణ

హత్నూర నవంబరు 21, ప్రభాతవార్త: హత్నూర మండలం సిరిపురం గ్రామ పంచాయతీకి స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురా లిగా పనిచేస్తున్న లక్ష్మిప్రసన్న పంచాయతీ కార్యదర్శికి కంప్యూటర్‌ను అంద జేశారు.

మత్స్యసహకార సంఘాలను ఏర్పాటు చేయాలి

నర్సాపూర్, నవంబరు 21, ప్రభాతవార్త : గ్రామాల్లో మరిన్ని మత్స్య సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని ముదిరాజ్ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జీ దిగంబర్‌రావు అన్నారు. గురువారం మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండినవారికి మత్స్యకారునికి సంఘంలో సభ్యత్వం ఇవ్వాలన్నారు. అదే విధంగా మత్స్యకారులకు భద్రత చట్టం తీసుకురావాలని, ఉచిత చేపపిల్లల స్థానంలో ఆయా సొసైటీలకు నగదు బదిలీ చేయాలని, 50 సంవత్సరాలు నిండినవారికి పెన్షన్‌లు, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని మత్స్యకారుల వలలు తిప్పలు పుట్టి, భూట్లు, ఐస్ బాక్స్‌లు ఉచితంగా అందజేయాలన్నారు. అంతేగాక మత్స్యకారులకు మార్కెట్ సౌకర్యం కల్పించాలని అదేవిదంగా తిరిగి అమ్ముకోవడానికి మోపెడ్‌లు, టాటా ఏసిలు, ఆక్సిజన్ కిట్టులు ఉచితంగా ఇవ్వాలని అన్నారు. ఈమేరకు మత్స్యకారులకు అన్ని సౌకర్యాలు కల్పించి వారి అభివృద్ధికి తోడ్పడాలని దిగంబర్‌రావు అన్నారు.



మాట్లాడుతున్న సత్తిరెడ్డి

ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం నిరంతర పోరాటం

జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్తిరెడ్డి

కొమురవెల్లి, నవంబరు 21, ప్రభాతవార్త : దేశంలో సిపిఎం ఆచరించే ప్రత్యామ్నాయ రాజకీయ విధానాలే దేశానికి దిక్సూచి అని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్తిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సిపిఎం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం చేస్తూ వస్తుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలన్నీటిని ప్రైవేటు కార్పొరేట్ కంపెనీలకు అప్పనంగా అప్పగిస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అనేక ప్రజా ఉద్యమాలను రూపకల్పన చేసేందుకు మహాసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. డిసెంబరు 1,2 తేదీలలో గజ్వేల్ జరిగే సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలన్నారు. డిసెంబరు 1న జరిగే బహిరంగ సభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరువుతున్నట్లు తెలిపారు. బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు తాడూరి రవీందర్, అత్తిని శారద, బోడిగం వరలక్ష్మీ. ఉల్లంపల్లి సాయిలు, తాడూరు మల్లేశం, భక్కెల్లి బాలకిషన్, దాసరి చక్రపాణి, నీల బిక్షపతి, తడకపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి తీయుటంలో రైతులు జాగ్రత్తలు పాటించాలి : ఎవో

జగదేవ్‌పూర్, నవంబరు 21 (ప్రభాతవార్త): రైతులు పత్తి పంట నుండి పత్తి తీసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లేకుంటే పత్తి నాణ్యత దెబ్బతింటుందని మండల వ్యవసాయాధికారి యు.వసంతరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామంలో పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి సాగుచేసిన రైతులు పలు రకాల కంపెనీ విత్తనాలను సాగు చేయడం వల్ల వివిధ దఫాలుగా పంట తీయుటకు వస్తుందని అలాంటి సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఉదయం సమయంలో మంచు ఎక్కువగా ఉంటుందని, ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల మధ్య పత్తి తీస్తే మంచిదని, పూర్తిగా పగిలిన కాయలను మాత్రమే తీయాలని అన్నారు. కొన్నిసార్లు కొన్ని పత్తికాయలు పగిలి మరికొన్ని పగలకుండా ఉంటాయని, అప్పుడు వాటిని తీసేందుకు రైతులు రెండుమూడు రోజులు ఆలస్యం చేస్తుంటారని, ప్రకృతి వైపరీత్యాల వల్ల అకాల వర్షాలు కానీ అధిక మంచు వల్ల పూర్తిగా పగిలిన పత్తి రంగు మారి నాణ్యత దెబ్బతింటుందని, అందువల్ల రైతులు ఎప్పటికప్పుడు పగిలిన పత్తిని వెనువెంటనే తీయాలని అన్నారు. పత్తిని నిల్వ చేసే సంచులు కూడా శుభ్రంగా ఉంచుకోవాలని, రైతులు జాగ్రత్తలు పాటించి పత్తి నాణ్యతను పెంచవచ్చని, మండలంలో ఇప్పటికి రెండు సిసిఐ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులు అందరూ నాణ్యమైన పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లి ప్రభుత్వం అందించే మద్దతు ధర క్వింటాలుకు రూ.7,520 పొందాలని సూచించారు.

దివ్యాంగులకు రూ. 6 వేల పెన్షన్ ఇవ్వాలి

మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేస్తున్న దివ్యాంగులు

హుస్నాబాద్ టౌన్, నవంబరు 21, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన హామీ మేరకు ఫించన్ రూ 6వేల ఫించన్‌తో పాటు అర్హులైన ప్రతీ దివ్యాంగులకు నూతన పెన్షన్‌లను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం రోజున వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్వహిస్తున్న ఈ దీక్ష మూడు రోజులు కొనసాగుతోందని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా దివ్యాంగులకు ఇస్తామని హామీ ఇచ్చిన రూ 6వేల పెన్షన్ అమలు చేయడంతో పాటు సబ్సిడి వాహనాలు ఇవ్వాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్లలో సైతం దివ్యాంగులకు ప్రత్యేక కోటా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దివ్యాంగుల సమ్మేళక సిపిఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేష్ మద్దతు తెలిపారు.

విద్యార్థులలో సృజనాత్మకతను పెంచేందుకే సైన్స్ సంబరాలు

విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంఈవో

ధూళిమిట్ట, నవంబరు 21, ప్రభాతవార్త: విద్యార్థులలో సృజనాత్మకతను పెంచేందుకే చెక్‌ముకి సైన్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి మీనాంజనేయులు తెలిపారు. గురువారం ధూళిమిట్టలోని జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెక్‌ముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు అనుముల కరుణాకర్‌రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఎంఈవో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంబరాలలో విద్యార్థులకు వివిధ అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అందులో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మండలస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు జిల్లా స్థాయి సంబరాల్లో అవకాశం కల్పించనున్నట్లు సూచించారు. కార్యక్రమంలో కూటిగల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సతీష్‌తో పాటు ఉపాధ్యాయులు నాగరాజు, రవికుమార్, రాములు, హరిబ్రహ్మం పాల్గొన్నారు.

వైభవంగా కొండపోచమ్మ వార్షికోత్సవ వేడుకలు

జగదేవ్‌పూర్, నవంబరు 21 (ప్రభాతవార్త): మండల పరిధిలోని తీగుల్ నర్సాపూర్ సమీపానవెలసిన శ్రీకొండపోచమ్మ అమ్మవారి 23వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రెండవ రోజు గురువారం ఉదయం ప్రతాకాల పూజ, హవనము, మూలమంత్ర హోమం, స్థాపిత దేవతాపూజ, కుంకుమార్చన నిర్వహించారు. సామూహిక కుంకుమార్చనలో వివిధ గ్రామాలకు చెందిన మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి రవికుమార్, తీగుల్‌నర్సాపూర్ మాజీ సర్పంచ్ గర్నెపల్లి రజిత రమేష్, ఆలయ సిబ్బంది పుల్లం కనకయ్య, అర్చక బృందం కొండయ్య, గోవర్ధన్, లక్ష్మణ్, ఐలయ్య, తిరుపతి, రమేష్, సిబ్బంది హరిబాబు, అంజయ్య, సుధాకర్, చందు పాల్గొన్నారు.

వార్షికోత్సవ వేడుకల్లో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

విద్యార్థులు విజ్ఞానం కోసం చదవాలి

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

సంగారెడ్డి బ్యూరో నవంబరు 21, ప్రభాతవార్త: విద్యార్థులు సైన్స్, గణిత శాస్త్రాలను ఇష్టపడి చదవాలని, మార్కుల కోసం కాకుండా జ్ఞానం కోసం చదవాలని అదే మనకు ముందు ముందు ఉన్నత శ

Main-IV(MDK)-NOV 21:Main-IV(MDK)-NOV 21.qxd 11/21/2024 8:20 PM Page 1

తరుగు పేరిట రైసుమిల్లర్ల దోపిడీ

విలేకరులతో మాట్లాడుతున్న రైతులు

పాపన్నపేట, నవంబరు 21, ప్రభాతవార్త: తరుగు పేరుతో దోపిడీకి పాల్పడుతున్న రైసుమిల్లు యజమానిపై చర్యలు తీసుకోవాలని మండల రైతులు డిమాండ్ చేస్తున్నారు. ధాన్యాన్ని లక్ష్మీనగర్ శివారులోని దత్తసాయి రైసు మిల్‌కు తీసుకుపోతే, తరుగు పేరిట దోపిడీ చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. రైసుమిల్లుకు 42కిలోల 200గ్రాముల చొప్పున పంపిన ప్పటికీ తరుగు పేరిట దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రెండు క్వింటాళ్ల 70కిలోలు తరుగు తీశాడని, నార్సింగ్ గ్రామానికి చెందిన నర్సింలు, ఒక క్వింటాల్ 70కిలోల తరుగు తీశాడని దశరథ్‌లు ఆరోపించారు. అక్రమంగా తరుగు తీస్తున్న రైసుమిల్లు యజమానిపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

సంగారెడ్డి టౌన్, నవంబరు 21, ప్రభాతవార్త: చెట్ల కొమ్మల నరికివేత, మెయింటెనెన్స్‌లను పురస్కరించుకుని ఈ నెల 22న జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎఎఈ కె.స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి టౌన్-2 విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కెవి బాలాజీ, సన్‌రైజ్ ఫీడర్‌లపై ఉన్న చెట్టు కొమ్మల తొలగింపు కార్యక్రమాన్ని చేపడుతున్నందున ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పట్టణంలోని బాలాజీనగర్, మంజీరా నగర్, ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయిస్ కాలనీ, ఆహ్మద్‌నగర్, బుర్మాకాలనీ, సన్‌రైజ్ ఆసుపత్రి ఏరియా, సాయిక్రిష్ణనగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విద్యుత్ అధికారులకు తమవంతు సహకారం అందించాలని ఎఎఈ స్వామి పట్టణ ప్రజలకు సూచించారు.

వీధి కుక్కల బెడద

పుల్‌కల్‌లో కుక్కల మంద దృశ్యం

పుల్‌కల్, నవంబరు 21, ప్రభాతవార్త: గడప దాటితే వీధి కుక్కల బెడద అధికమయింది. రోడ్డువెంట వాహనచోదకులు కుక్కల బెడదతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే... మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో వీధి కుక్కల బెడద రోజురోజుకు అధికమవుతుండటంతో చిన్నారులను పాఠశాలకు పంపేందుకు తల్లిదండ్రులు భయకంపితులవుతున్నారు. వీధి కుక్కల కాటుకు రేబిస్ వ్యాధి రాకుండా టీకాలు వేసే పరిస్థితిలేక ప్రజలు కుక్కలను చూస్తే పరుగులు తీస్తున్నారు. వాహనదారులు వీధి కుక్కల బెడదతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల బెడద లేకుండా తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు వినతి చేస్తున్నారు.

సరపల్లిలో పశువైద్య శిబిరం

చౌటకూరు, నవంబరు 21, ప్రభాతవార్త: మండల పరిధిలోని సరపల్లి గ్రామంలో గురువారం పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని రైతులు సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి విశాల్ కుమార్ మాట్లాడుతూ గర్భకోశ చికిత్సలో సాధారణ చికిత్సలు కృత్రిమ గర్భధారణకై దూడలకు నట్టల నివారణ మందులు వేశామని తెలిపారు. శీతాకాలం సమయంలో దూడలను జాగ్రత్తగా సంరక్షించుకోవాలన్నారు. గోపాలమిత్ర సూపర్‌వైజర్ అర్జునయ్య మాట్లాడుతూ రైతులు పాడిగేదెలను సాకాలని తెలిపారు. లింగ నిర్ధారణ వీర్యం గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గోపాలమిత్ర ఆర్.శంకరయ్య, డి.మాణిక్యం, సిబ్బంది ప్రభాకర్, సులో చన, ఓఎస్.సంగయ్య, రైతులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

ప్రమాదాల నివారణకు ఏర్పాట్లు చేస్తున్న పోలీసులు

పుల్‌కల్, నవంబరు 21, ప్రభాతవార్త: సంగారెడ్డి నాందేడ్ అకోలా 161 జాతీయ రహదారిపై వాహనాల వేగం నియంత్రణకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. మండల పరిధిలోని జాతీయ రహదారిపై టార్జాన్‌పల్లి చౌరస్తా సుల్తాన్‌పూర్ గ్రామాల వద్ద జాతీయ రహదారిపై జిగ్‌జాగ్ మార్చారు. గురువారం ఆయా ప్రాంతాల్లో డ్రమ్ములకు ఎల్లో స్టిక్కర్‌లు అతికించడమే కాకుండా భారీ గేట్లను ఏర్పాటు చేశారు. టోల్ ప్లాజా దాటగానే వాహనాలు వేగంగా నడపటంతో ఆయా ప్రాంతాల వద్ద రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టామని సిఐ అనిల్ కుమార్, ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్‌లు తెలిపారు. అటుగా వచ్చిన వాహనచోదకులకు సిఐ, ఎస్ఐ పలుసూచనలు చేశారు. ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్, నాలుగు చక్రాల వాహనచోదకులు సీటుబెల్టును పెట్టుకోవాలని సూచిం చారు. వాహనాలకు ఇన్సూరెన్సు, డ్రైవర్ లైసెన్సులు, వాహనాల ధృవపత్రాలు తమ దగ్గర ఉంచుకోవాలని సూచించారు. మైనర్‌లకు వాహనాలు నడిపేందుకు ఇవ్వకూడదని సిఐ, ఎస్ఐలు హెచ్చరించారు.

కార్తీకమాస విశేష పూజలు

త్రిశూలం ఆకారంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

వర్గల్, నవంబరు 21 (ప్రభాతవార్త): వర్గల్ మండలం నాచగిరి శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో కార్తీకమాసమును పురస్కరించుకొని గురువారం స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకోగా పలువురుభక్తులు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను చేయించుకున్నారు. కార్తీకదీపోత్సవంలో 20వరోజు మహిళాభక్తులు స్వామివారి నామస్మరణతో దీపాలను త్రిశూలం ఆకారంలో వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చిన ప్యాకేజీలు కాలిగోటితో సమానం

-సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శివలింగ కృష్ణ

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శివలింగ కృష్ణ

గజ్వేల్ టౌన్, నవంబరు 21 (ప్రభాతవార్త): మాయమాటలతో నమ్మించి మోసం చేసి ముంపు బాధితులకు అన్ని రకాల ప్యాకేజీలు అందించామని గత ప్రభుత్వం గొప్పలు చెప్తున్నారని, నిర్వాసితులకు ఇచ్చిన ప్యాకేజీలు కాలిగోటితో సమానమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇంచార్జ్ శివలింగ కృష్ణ అన్నారు. గురువారం గజ్వేల్‌లో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మల్లన్నసాగర్ నిర్మాణ సమయంలో నిర్వాసితులను నమ్మించి గత ప్రభుత్వం మోసంచేసిందని, ఇల్లుకు ఇల్లు, బడికి బడి, గుడికి గుడి ఇస్తామని చెప్పి ఊర్లను ఖాళీ చేయించారని, చనిపోతే బొంద పెట్టడానికి కూడా స్థలం కేటాయించకుండా నిర్వాసితుల పట్ల కపటప్రేమ చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. పుట్టిన ఊరిని వదిలి ఎక్కడో అనాథలుగా నివాసాలు ఏర్పాటుచేశారని, అక్కడ కూడా ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా నిర్వాసితులను గాలికి వదిలేశారని, అధికారం కోల్పోయాక నిర్వాసితులను కన్నబిడ్డల్లా చూసుకొని అన్ని సౌకర్యాలు కల్పించామని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని గత పాలకులపై మండిపడ్డారు. మల్లన్నసాగర్ భూనిర్వాసితుల సమస్యలు తెలుసుకొని అసెంబ్లీలో ప్రస్తావించడానికి ఖమ్మం ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో పర్యటించనున్నట్లు తెలిపారు.

ఫీజు రియంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి

నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

చేర్యాల, నవంబరు 21, ప్రభాతవార్త: పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌ను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గురువారం రాష్ట్రసమితి పిలుపులో భాగంగా పట్టణంలో విద్యార్థులతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగళ్ళ నరేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతుందని వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆకుల శిరీష, ఎద్దు కార్తీక్, పోతుగంటి సాయి కిరణ్, రమేష్, రాజు, స్వప్న, అంజలి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంకల్పదీక్ష కరపత్రాల విడుదల

కరపత్రాలు విడుదల చేస్తున్న జెఏసి నాయకులు

చేర్యాల, నవంబరు 21, ప్రభాతవార్త: ప్రభుత్వం దృష్టి చేర్యాల వైపు మళ్ళించడానికే ప్రజాసంకల్పదీక్ష నిర్వహిస్తున్నట్లు జెఏసి చైర్మన్ డాక్టర్ రామగళ్ళ పరమేశ్వర్ తెలిపారు. గురువారం జెఏసి ఆధ్వర్యంలో ప్రజా సంకల్పదీక్షకు సంబంధించిన కరపత్రాలను జెఏసి నాయకులతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పూర్మ ఆగంరెడ్డి, అంకుగారి శశిధర్‌రెడ్డి, గిరి కొండల్‌రెడ్డి, తోకల ఉమారాణి, అందె అశోక్, అందె బీరయ్య, పిల్లి చంద్రం, చెరుకు రమణారెడ్డి, రామడుగు బాలరాజు, ఇర్రి ఉమా సురేశ్‌రెడ్డి, చెటుకూరి కమలాకర్, పూర్మ సంజీవరెడ్డి, తగక లింగమూర్తి, తాళ్ళపల్లి రమేష్, ఆవుశర్ల యాదయ్య, ఎండి.ఇక్బాల్, ఈరి భూమయ్య, కోట సాయిలు, ఎండి.జహురుద్దీన్, అంబటి అంజయ్యగౌడ్, కరెడ్ల రఘుపతి రెడ్డి, టివి నారాయణ, జంగిలి యాదగిరి, మంకాల నగేష , వలబోజు నరసింహాచారి, సనవాల ప్రసాద్, పాకాల ఇసాక్, కామల్ల అనిల్, గూడ రాజిరెడ్డి, బండి శ్రీనివాస్, ఆరుట్ల వినీత్, పుట్ట రమేష్, సిద్ధిరాం భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహణ

విజేతలైన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న దృశ్యం

వెల్దుర్తి, నవంబరు 21 ప్రభాతవార్త: మండల కేంద్రమైన వెల్దుర్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో గురువారం మండలస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు రాములు, విజయభాస్కర్‌రెడ్డి, చార్లెస్, జనవిజ్ఞానవేదిక మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చందర్, కామేశ్వరరావులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ మూఢనమ్మకాలను విడనాడాలని, సైన్స్‌పట్ల అవగాహన పెంచు కోవాలని, శాస్త్రసాంకేతికరంగాలలో మనదేశం సాధించిన అభివృద్ధిని వివరిం చారు. మండలస్థాయిలో ఇంగ్లీష్ మీడియం నుండి ప్రథమస్థానం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి విద్యార్థులు, తెలుగు మీడియం నుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంగళపర్తి విద్యార్థులు సాధించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేయడం జరిగింది.

బేటీ బచావో బేటీ పడావో

అంగన్‌వాడి టీచర్లకు సూచనలు ఇస్తున్న డిడబ్ల్యుఓ లలిత

ఝరాసంగం, నవంబరు 21, ప్రభాతవార్త: మండల కేంద్రమైన ఝరాసంగంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని గ్రామాల అంగన్‌వాడి టీచర్లతో ప్రాజెక్టు సమావేశం నిర్వహించారు. సమావేశానికి డిడబ్ల్యుఓ లలితకుమారి హాజరై అంగన్‌వాడి టీచర్లకు పలుసూచనలు చేశారు. బాలికల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించేందుకు పాఠశాలల్లో బేటీ పడావో బేటీ బచావో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆడపిల్లలకు చిన్నవయసులో వివాహాలు చేసినా, బాలికలను వేధింపులకు, ఇబ్బందులకు గురిచేసినా కఠినచర్యలు తప్పవని, బాలికలు వేధింపులకు గురైతే 181, 1098కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సిడిపివో అంజమ్మ, డిహెచ్ఈడబ్ల్యు జెండర్ స్పెషలిస్ట్ యాదగిరి, విశాల, సూపర్‌వైజర్లు అనితాకుమారి, రాధమ్మ, నీరజ, గ్రేస్‌స్కూల్ ప్రధానోపాధ్యాయులు దామోదర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిని నియమించాలి

సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న సిపిఐ నాయకులు

చేర్యాల, నవంబరు 21, ప్రభాతవార్త: చేర్యాల మండలం కడవేర్గు గ్రామ పంచాయతీలో వారంరోజులుగా కార్యదర్శి లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఐ డివిజన్ కమిటీ సభ్యులు కత్తుల భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సిపిఐ నాయకులు పర్మినెంట్ కార్యదర్శిని నియమించాలని సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఆరుట్ల లింగం, సొనుగంటి శ్రీనివాస్ రెడ్డి, గదరాజు భిక్షపతి తదితరులు ఉన్నారు.

దశదిన కర్మలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

కొల్చారం, నవంబర్ 21 ప్రభాతవార్త: నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి నానమ్మ ఆవుల రామమ్మ దశదినకర్మ మండల కేంద్రమైన మాసాయిపేట గ్రామంలో గురువారం జరిగిన కార్యక్రమానికి కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగుల గారి మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మాసాయిపేటకు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో చందాపురం మధుసూదన్ రెడ్డి, గంగసాని మహేశ్వర్‌రెడ్డి, మరెల్లి అనిల్ కుమార్, దేవన్నగారి శేఖర్, యెల్లుగారి శ్రీనివాస్ రెడ్డి, గోవిందగారి శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆవుల రామమ్మ చిత్ర పటానికి ఘనంగా నివాళులు అర్పించారు.

చెత్త సేకరణపై సిబ్బందికి అవగాహన

సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ నర్సయ్య

గజ్వేల్ టౌన్, నవంబరు 21 (ప్రభాతవార్త): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో చెత్తను సేకరించే స్వచ్ఛ ఆటో డ్రైవర్లకు, సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి చెత్త సేకరణకు వెళ్ళే సిబ్బంది తడి, పొడి, హానికర చెత్తను వేరుచేసి తీసుకోవడంతో పాటు ఇంటి యజమానులు తడి, పొడి, హానికరచెత్తను వేరుచేసేలా తెలియజేయాలన్నారు. ఇంటి యజమానులు చెత్తను బహిరంగ ప్రదేశాలలో వేయకుండా స్వచ్ఛ వాహనాలకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.రవీందర్, జవాన్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను, బాయిల్డ్ రైస్ మిల్లులను సందర్శించిన ఎస్ఐ

కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ మహమ్మద్ గౌస్

కొల్చారం, నవంబరు 21 ప్రభాతవార్త: కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం తరలింపు, అలాగే అన్ లోడింగ్ విషయంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కొల్చారం ఎస్ఐ మహమ్మద్ గౌస్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన కొల్చారం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎస్ఐ మహమ్మద్ గౌస్ పరిశీలించారు. కొల్చారంలోని బాయిల్డ్ రైస్ మిల్లులనును సందర్శించి ధాన్యం అన్ లోడింగ్ విషయంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని బాయిల్డ్ రైస్ మిల్లుల యజమానులకు శ్రీనివాస్ గుప్తా సూచించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ ధాన్యం తరలింపులో, అన్ లోడింగ్ విషయంలో రైతులకు ఇబ్బందులు రాకుండా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు ఉన్నారు.

డాక్టరును సన్మానించిన బాపు మల్‌శెట్టి

డాక్టర్ అజయ్‌ను సన్మానిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు బాపు మల్‌శెట్టి

నారాయణఖేడ్, నవంబరు 21, ప్రభాతవార్త: నారాయణఖేడ్ ప్రాంతం నుంచి ఎంతో కష్టపడి ఉన్నతచదువులు చదివి డాక్టరు కావడం ఎంతో అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకందారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాపు మల్‌శెట్టి అన్నారు. గురువారం నారాయణఖేడ్ పట్టణంలో డాక్టరు ఆజయ్‌కు పూలమాల, శాలువతో ఘనంగా సన్మానించి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాపు మల్‌శెట్టి మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతం నుంచి ఎంతో కష్టపడి చదువుకుని డాక్టరు కావడం ఎంతో అభినందనీయమన్నారు. నాగల్‌గిద్ద మండలంలోని గుడూరు గ్రామానికి చెందిన శ్రీదేవి, మారుతి గార్ల కుమారుడు ఈయన. ఆజయ్ బిహెచ్ఎంఎస్ ఎంఎస్సి, పబ్లిక్ హెల్త్(యుకె) నుం డాక్టరయ్యారు. కాగా ఈ ప్రాంత యువతీయువకులు కష్టపడి చదువుకుని ఉన్నతశిఖరాలను ఎదగాలని ఆయన అన్నారు. రానున్న రోజుల్లో ఇంకా ఎందరో ఉన్నత ఉద్యోగాలు సాధించి యువత ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకందారుల సంక్షేమసంఘం సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు గోవిందయాదవ్, కల్లుగీత కార్మికుల సంఘం సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు అంజాగౌడ్, నారాయణఖేడ్ నియోజకవర్గం అధ్యక్షులు ఓంప్రకాష్, కల్లుగీత కార్మిక సొసైటీ డైరెక్టరు శంకర్‌గౌడ్, నర్సింలు టీచర్, సురేష్, ఎన్.శ్రీనివాస్, పండరిరెడ్డి, విఠల్, పండరి, విజయ్, విఠల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహప్రతిష్ఠలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దంపతులు



అభయాంజనేయస్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి దంపతులు

సంగారెడ్డి బ్యూరో, నవంబరు 21, ప్రభాతవార్త: మెదక్ పట్టణంలోని 13వ వార్డులోని ద్వారకానగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయస్వామి సహిత శివపంచాయతన విగ్రహప్రతిష్ఠా మహోత్సవంలో గురువారం కాలనీ వాసులు స్థానిక కౌన్సిలర్ సులోచన ప్రభురెడ్డి, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కన్నులపండుగగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు, మెదక్ మాజీ ఎమ్మెల్యే ఎం.పద్మాదేవేందర్‌రెడ్డి దంపతులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంజనేయస్వామి ఆశీస్సులతో మెదక్ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని ఘనంగా శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మాజీ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు ఎం.లావణ్య రెడ్డి, మెదక్ మున్సిపల్ కౌన్సిలర్‌లు కృష్ణరెడ్డి, మామిళ్ళ ఆంజనేయులు, ఆర్‌కె.శ్రీనివాస్, జయరాజ్, నాయకులు లింగారెడ్డి, చింతల నరసింహులు, కేవల్ జగదీష్, మోహన్‌రాథోడ్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మహాపడిపూజ ఆహ్వాన కరపత్రిక

సదాశివపేట, నవంబరు 21 ప్రభాతవార్త: సదాశివపేట పట్టణంలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో అనిల్ గురుస్వామి నిర్వహించనున్న 18వ మహాపడిపూజ మహోత్సవ కార్యక్రమానికి గురువారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజును ముఖ్య అతిథిగా ఆహ్వానించడం జరిగింది. ఈ పడిపూజ కార్యక్రమం ఈ నెల 24వ తేదీన ఆదివారం సాయంత్రం 6:30 గంటలకు ప్రారంభించబడుతుందని వారు తెలిపారు. ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో అయ్యప్ప దీక్షలను చేపడతామని, దీక్ష అనంతరం ప్రతి స్వామి తన ఇరుముడితో శబరిమలకు వెళ్లి అయ్యప్పస్వామిని దర్శించుకుంటారని తెలియజేశారు. తాను నిర్వహించే ఈ 18వ మహాపడిపూజ కార్యక్రమానికి వివిధ గ్రామాలలో, మండలంలో, స్థానికంగా గానీ అయ్యప్పమాలను ధరించిన గురుస్వాములు, కన్నె స్వాములు, కత్తిస్వాములు, గంటస్వాములు, గదాస్వాములు, భక్తులం దరూ పెద్దసంఖ్యలో విచ్చేసి పడిపూజ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని అనిల్ గురుస్వామి కోరడం జరిగింది. కార్యక్రమంలో సిద్ధు స్వామి, అభి స్వామి, రాగం అనిల్ స్వామి, పిఎంఆర్ యువసేన నాయకులు తాలెల్మ రాము, బోయిని రమేష్, నల్ల ఆనంద్, అఖిల్, నరేష్, మనోజ్, సోమ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలి

సమావేశంలో మాట్లాడుతూన్న దృశ్యం

దుబ్బాక, నవంబరు 21, ప్రభాతవార్త: సమగ్ర కుటుంబ సర్వే డాటాను జాగ్రత్తగా ఆన్లైన్లో నమోదు చేయాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. గురువారం దుబ్బాక మండలంలోని సమీకృత కార్యాలయంలో సమగ్ర కుటుంబ సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాకలో జరుగుతున్న సామాజిక ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర కుటుంబ సర్వే) యొక్క ఫారములోని పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో ఏ విధముగా నమోదు చేయాలో ప్రెజెంటేషన్ ద్వారా వివరించడం జరిగింది. ఈ నమోదులో ఎడిట్ ఆప్షన్ లేనందున ప్రతి ఫారము చాలా జాగ్రత్తగా నమోదు చేయవలసిందిగా చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ సంజయ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యం

జహీరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త: పట్టణ శివారులోని ఈద్గా మైదానం సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి శవాన్ని గురువారం కనుగొన్నట్లు పట్టణ సిఐ శివలింగం తెలిపారు. సిఐ కథనం ప్రకారం, ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు గుర్తు తెలియని వ్యక్తిని హత్యచేసి ఉంటారని ప్రాథమిక ఆనవాళ్ల ప్రకారం అనుమానిస్తున్నట్లు పేర్కొన్నారు. మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి ఆచూకీ తెలిస్తే జహీరాబాద్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.